ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు

◆ఈనెల 30న రైతు భరోసాతో పాటు పంపిణీ

◆శింగనమలకు అత్యధికం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వం రైతు భరోసాతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు అందజేయనుంది. ఈనెల 30వ తేదీనే రైతు భరోసాతోపాటు దీనినిని వేయనుంది. ఉద్యానవన పంటలు, వ్యవసాయ పంటలు దెబ్బతిన్న పంటలు రెండింటికీ రూ.8.35 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేయనుంది. సత్యసాయి జిల్లాకు రూ.49.20 లక్షలు రానుంది. అనంతపురం జిల్లాలో 1946 హెక్టార్లలో వ్యవసాయ పంటలు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పడిన అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. దీనికి సంబంధించి మొత్తం 2832 మంది రైతులకు నష్టం వాటిల్లింది దీనికి సంబంధించి రూ.2.60 కోట్లు మంజూరు చేశారు. ఇక ఉద్యానవన పంటలకు సంబంధించి 2356 హెక్టార్లలో 2479 మంది రైతులకు నష్టం వాటిల్లింది. దీనికి సంబంధించి రూ.5.75 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రానుంది. రెండు రకాల పంటలకు సంబంధించి 5311 మంది రైతులు 4303 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. రెండు రకాల పంటలకు కలిపి మొత్తం రూ.8.35 కోట్లు మంజరైంది. సత్యసాయి జిల్లాకు సంబంధించి వ్యవసాయ పంటలకు రూ.31.22 లక్షలు, ఉద్యానవన పంటలకు సంబంధించి రూ.17.97 లక్షలు మంజూరైంది. మొత్తం రూ.49.20 లక్షలు మంజూరైంది.

శింగనమలకే అత్యధిక పరిహారం

పంటనష్ట పరిహారానికి సంబంధించి అనంతపురం జిల్లాలో శింగనమల నియోజకవర్గం పరిధిలోనే అత్యధికంగా వ్యవసాయ పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ అందనుంది. 1611 హెక్టార్లకు సంబంధించి రూ.2.01 కోట్లు పరిహారం రైతులకు అందనుంది. మార్చి నెలలో నార్పల మండలంలో పడిన వడగండ్ల వానకు పెద్దఎత్తున పంటలకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. శింగనమల, పుట్లూరు, నార్పల మండలాల్లో ఎక్కువగా పంటలకు నష్టం వాటిల్లింది. ఈ ప్రాంతంలోనే ఇన్‌పుట్ సబ్సిడీ అధికంగా రానుంది. ఉద్యానవన పంటలు కూడా ఈ ప్రాంతంలోనే అధికంగా నష్టం వాటిల్లడంతో ఆ పంటలకు ఈ మండలాల్లోనే అధికంగా ఇన్‌పుట్ సబ్సిడీ రానుంది.

రైతు భరోసానూ పంపిణీ

రైతు భరోసా మొత్తాన్ని కూడా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఇది వరకే ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.158 కోట్లు మంజూరు చేయనున్నారు. దీంతో అధిక వర్షాలతో మార్చి, ఏప్రిల్ , మే నెలలో దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా రానుండటంతో సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం పంటనష్టాన్ని, రైతు భరోసానూ రైతులకు అందజేయనుంది. ఈ సీజన్ పెట్టుబడులకు ఈ రెండు ఇవ్వడంతో రైతులకు కొంత ఊరట లభించనుంది. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో రెండింటి వలన అధిక వర్షాలకు రైతులకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం పంటనష్టంతోపాటు, రైతు భరోసాను కలిపి ఒకేసారి ఇవ్వడంతో నష్టపోయిన రైతుకు ఒకేసారి రెండు కలసి రావడంతో ఈ ఖరీఫ్‌కు పెట్టుబడులకు ఇబ్బందులేకుండా ఉండేందుకు వీలుంది.



ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఇళ్ల నిర్మాణాలను జాప్యం చేయొద్దు

అధికారులు ప్రణాళికతో ముందుకెళ్లాలి

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-కొత్తచెరువు, పుట్టపర్తి అర్బన్

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు జాప్యం కాకుండా వేగవంతంగా పనులు పూర్తియ్యేలా లబ్ధిదారులను చైతన్యం చేసి వారికి సహకారం అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. శనివారం నాడు మండల కేంద్రంలోని ధర్మవరం రోడ్ పక్కన ఉన్న 384 సర్వే నెంబర్లు జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కొత్తచెరువులో మూడు కాలనీల్లో కలిపి వెయ్యి మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయగా ఇందులో 70 శాతం పునాదుల స్థాయిలో ఉన్నాయన్నారు. మిగిలిన 30 శాతం కూడా వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయనని తెలిపారు. ఈ నిర్మాణాలను వేగవంతం చేసేలా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జగన్న కాలనీల్లో రహదారులు, విద్యుత్, నీటి సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జూన్ నెల ఆఖరికి వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. బిల్లులు కూడా వారికి త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ సిబ్బందికి తెలిపారు. నిర్మాణాలు ఇంకా ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడాలి పనులు మొదలు పెట్టేలా అవగాహన కల్పించాలన్నారు. పెనుగొండ రహదారిలో 483 సర్వే నంబర్‌లో జగనన్న కాలనీకి వెళ్లే రహదారికి స్థలం ఇచ్చిన రైతులకు నష్టపరిహారం సంవత్సరమైనా ఇప్పటికీ ఇవ్వలేదని బాధితులు కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు. త్వరితిగతన ఈ సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ జిల్లా పీడీ చంద్రమౌళి రెడ్డి, ఎంపీడీవో సిద్ధారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వెంకట్ రెడ్డి, హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, ఏపిఎం నాగేంద్ర, పిఆర్‌జెఈ నాగరాజు, విద్యుత్ ఏఈ వెంకటేష్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఓబులేసు పాల్గొన్నారు.

ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ లబ్ధిదారులను గుర్తించండి

పుట్టపర్తి అర్బన్: ఆయా గ్రామాల్లో ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ లబ్ధిదారులను గుర్తించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్రకతి వ్యవసాయం సంబంధిత లబ్ధిదారుల గుర్తింపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జెడ్పీఎస్ఎఫ్‌లో భాగంగా ప్రకతి వ్యవసాయం చేస్తున్న లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాలో 1055 మంది ఎస్సీ రైతులు ప్రకతి వ్యవసాయం చేస్తున్నారని, ఎస్సీ కార్పొరేషన్ ఎమ్‌డికి రైతు సాధికారిక సంస్థ ద్వారా నివేదిక అందజేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో వారంతా ప్రకతి వ్యవసాయం చేస్తున్నారా.? లేదా.? అన్న దానిని పరిశీలించాలన్నారు. ఎస్సీ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయల ప్రకారం రూ.1.50కోట్లు రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని నిజమైన ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు, డిపిఎం, ఆగ్రోస్ సీడ్ కార్పొరేషన్ ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పర్యటించి నిజమైన లబ్ధిదారులను త్వరగతిన గుర్తించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ డీఈ ప్రభాకరరావు, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆగ్రోస్, సీడ్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని నాలుగు నెలల్లో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలని సంకల్పించారని, ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులంతా కలిసి కృషి చేద్దామని కలెక్టర్ అరుణ్ బాబు పిలుపుని చ్చారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నివారణ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిర్ణయించిన విధంగా జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనలో పురోగతి సాధిస్తామన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణా మాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలోని సచివాలయాల్లో డ్రగ్స్ పోస్టర్ల ను ప్రదర్శించాలన్నారు. విస్తతంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బయట ప్రాంతాల నుంచి వ్యక్తులు జిల్లాకు వచ్చే అవకాశం ఉండడంతో వారి ద్వారా డ్రగ్స్ సంస్కృతి వచ్చే అవకాశం ఉందని, పరిశ్రమల్లో ఎవరైనా డ్రగ్స్ ఉపయోగిస్తున్నారా అని లేబర్ శాఖ అధికారులు పరిశీలించాలన్నారు. జిల్లాలోకి డ్రగ్స్ రాకుండా అరికట్టాలని అందుకు పోలీసులతో పాటు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కర్నాటక సరిహద్దుల్లో, జాతీయ రహదారుల్లో తనిఖీలు నిర్వహించాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పి మాధవరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్‌ను అరికట్టడానికి కృషి చేస్తున్నామని, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా సమాచారం అందితే వెంటనే తమకు చేరవేయాలని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పి రామకష్ణ ప్రసాద్, సెబ్ అధికారి రవికుమార్, ఇంటెలిజెన్స్ డిఎస్‌పి గోవింద్, ఆర్డీవో భాగ్యరేఖ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి శివ రంగ ప్రసాద్, డిఎంహెచ్‌ఓ కష్ణారెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'పురం'లో రచ్చకెక్కిన ఫ్లెక్సీ వివాదం

10 మంది అరెస్టు.. అనంతరం విడుదల..

దమ్ముంటే నేరుగా తేల్చుకుందాం : ఛైర్‌పర్సన్

జనసేన, టిడిపి తీరు సరికాదు : నవీన్ నిశ్చల్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో ఫ్లెక్సీ వివాదం రెండు రోజులుగా రచ్చ కెక్కింది. శుక్రవారం రాత్రి రహమత్‌పురం సర్కిల్‌లో సిఎం జగన్ ఫొటోతో పేదలకూ పెత్తందారులకు యుద్ధం అనే స్లోగన్‌తో వైసిపి నాయకులు ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీపై టిడిపి, జనసేన నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. పోలీసులు వెంటనే స్పందించి ముగ్గురు టిడిపి నాయకులు, 7 మంది జనసేన నాయకులను అరెస్టు చేశారు. వారిని శనివారం కోర్టుకు హాజరు పరచడంతో వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇదిలా ఉండగా వైసిపి నాయకులు ఫ్లెక్సీలను చింపేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, సీనియర్ నాయకులు కొండురు వేణుగోపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో వేలాది మంది వైసిపి నాయకులు పెద్దఎత్తున పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి, సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అక్కడ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాజధానిలో పేదలకు ఇంటి పట్టాలను అందిస్తుంటే టిడిపి, జనసేన అడ్డుకోవడం తగదన్నారు. హిందూపురం టిడిపి, జనసేన నాయకులకు ధైర్యం ఉంటే నేరుగా ఎంజిఎం మైదానంలోకి వస్తే తేల్చుకుందామని ఛైర్‌పర్సన్ సవాల్ విసిరారు. ప్రశాంతంగా ఉన్నా హిందూపురంలో అశాంతిని రేపాలని చూస్తే సహించే ప్రశక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ జబివుల్లా, లేపాక్షి మండలం కన్వీనర్ నారాయణ స్వామి, జడ్పీటీసీ బాణాల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు చాంద్‌బాషా, లతీఫ్ సేట్, సర్పంచులు ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన తీరు దుర్మార్గం : నవీన్ నిశ్చల్

ముఖ్యమంత్రి రాజధానిలో పేదలకు ఇంటి పట్టాలను ఇస్తుంటే టీడీపీ, జనసేన పార్టీల నేతలు రాద్ధాంతం చేయడం దుర్మార్గమని ఎపి అగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పేదలు, పెత్తందార్లకి మధ్య పోరాటం అని వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని టీడీపీ, జనసేన నాయకులు చింపేయడం సరికాదన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ఎంతో దఢసంకల్పంతో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల అభివద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడకుండా ఫ్లెక్సీలను చింపడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి సంస్కతి హిందూపురంలో ఎప్పుడూ లేదని, దీనిని తీసుకురావొద్దని హితవు పలికారు. భవిష్యత్తులో ఇలాంటి విష సంస్కతి హిందూపురంలోకి రాకుండా అన్ని రాజకీయ పార్టీలు కలిసి ముందుకు రావాలన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీని దౌర్జన్యంగా చించివేసిన వారిపై కేసు నమోదు చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్, ఇర్షాద్, డాక్టర్ బాషా, సర్పంచి నాగేంద్ర, నాయకులు వేణురెడ్డి, చంటి, వరుణ్, ప్రమోద్, నటరాజ్ పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్లో నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న నవీన్‌నిశ్చల్

రెండోరోజూ కొనసాగిన బదిలీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాలో పోలీసు బదిలీల ప్రక్రియ రెండవ రోజు కొనసాగింది. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన బదిలీల్లో ఏడుగురు ఎఎస్ఐలు, 24 మంది హెడ్ కానిస్టేబుళ్లకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేశారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో గత ఐదు సంవత్సరాల నుంచి పని చేస్తున్న వారికి ఎస్పీ ఎస్‌వి.మాధవ్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్తి పాదర్శకంగా వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా బదిలీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగుల జీవితంలో బదిలీలు సాధారణమని, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. బదిలీల కోసం వచ్చిన సిబ్బందితో ఎస్పీ వ్యక్తిగతంగా మాట్లాడారు. ఈ కౌన్సిలింగ్ ప్రక్రియలో ఎస్పీతో పాటు ఆదనపు ఎస్పీ కెవి.రామకృష్ణప్రసాద్, ఎస్‌పిఐ రవీందర్ రెడ్డి, సిసి రాఘవేంద్ర, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.



బదిలీ నియామకపత్రం అందజేస్తున్న ఎస్పీ

వాహన కాలుష్య నివారణతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించినప్పుడే పర్యా వరణ పరిరక్షణ సాధ్యం అవుతుందని డిఎస్‌పి కంజాక్షన్ తెలిపారు. శనివారం నాడు రవాణ శాఖ ఆధ్వర్యంలో వాహన కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణపై రవాణ, పోలీస్ శాఖలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కంజాక్షన్, మొటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రమణలు మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై నియంత్రణ, జౌళి సంచుల వాడకం, విద్యుత్ ఆదా, సోలార్ వస్తువుల వినియోగం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కాలుష్య ఉద్గారాల నియంత్రణ, తక్కువ దూరాలకు సైక్లింగ్, ఎలివేటర్ బదులుగా మెట్లను వాడటం వంటి చర్యలతో పర్యావరణ పరిరక్షణకు బాటలు వేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌లు శివశంకర్, జయశ్రీ యాదవ్, సిఐలు ఈరన్న, రవాణశాఖ, పోలీస్ సిబ్బంది, డ్రైవింగ్ పాఠశాల సిబ్బంది, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

కదిరి వ్యవసాయ పరిశోధన స్థానానికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణం లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఉత్తమ విత్తనోత్పత్తికి (2022 సంవత్సరానికి) గానూ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి జాతీయ అవార్డు అందజేసింది. గుజరాత్ రాష్ట్రంలోని జునాఘడ్ జాతీయ వేరుశనగ పరిశోధన కేంద్రంలో ఈ నెల 24 నుంచి 26 వరకు జాతీయ స్థాయిలో వేరుశనగ శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారని, అందులో కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ 2022లో అధిక మొత్తంలో వేరుశనగ విత్తనోత్పత్తి చేసి దేశంలోని వివిధ రాష్ట్రాలకు వేరుశనగ కాయలు ఎగుమతి చేసినందుకు గానూ భారతీయ వ్యవసాయ పారిశోదన మండలి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టిఆర్ శ్యామ, డైరెక్టర్ డాక్టర్ బెవ అవార్డు అందజేశారన్నారు. ఈ అవార్డు దక్కడం పట్ల డాక్టర్ సంపత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కదిరి వ్యవసాయ పరిశోధన స్థానానికి అవార్డు వచ్చినందుకు ప్రధాన శాస్త్రవేత్త సంపత్, శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేష్, వేమన, వెంకటరమణలకు జాతీయస్థాయిలో ప్రశంసలు దక్కాయి.



అవార్డు అందుకుంటున్న కదిరి శాస్త్రవేత్తలు

క్వారీల ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

గ్రామసభను అడ్డుకున్న రైతులు

క్వారీ ఏర్పాటుతో ప్రజలకు ప్రమాదం



విఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని నిడిమామిడి ఎస్సీ కాలనీ ఊరకొండ సమీపంలో క్వారీల ఏర్పాటుపై గ్రామస్తులు, రైతులు అభ్యంతరం తెలిపారు. గ్రామానికి అతి సమీపంలో మూడు క్వారీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. ఈ తరుణంలో గ్రామస్తుల ప్రజాభిప్రాయ సేకరణ కోసం శనివారం ఆర్డీఓ భాగ్యరేఖ, తహశీల్దార్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో క్వారీ స్థలంలో గ్రామసభ ఏర్పాటు చేయడం వివాదానికి దారి తీసింది. సభకు గ్రామస్తులు, స్థానిక రైతులు రాకపోగా సదరు కాంట్రాక్టర్ తెచ్చుకున్న కూలీలనే గ్రామ రైతులని చెప్పి సభను ముగించేయాలని చూశారు. అయితే ఈ విషయం పసిగట్టిన నిడిమామిడి రైతులు, గ్రామస్తులు సభ జరుగుతున్న ప్రదేశానికి చేరుకుని మైకు తీసుకుని క్వారీల ఏర్పాటుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ క్వారీలను ఏర్పాటు చేయబోనివ్వమని ఖరాఖండిగా చెప్పారు. కొత్త నిడిమామిడి ఉన్నత పాఠశాలకు కేవలం పర్లాంగు దూరంలో క్వారీ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు, ఎస్సీ కాలనీ ప్రజలకు ఎంతో ప్రమాదమని తెలిపారు. అంతేకాక ఈ సమావేశా నికి నిడిమామిడి గ్రామస్తులను, రైతులను ఎందుకు ఆహ్వానించలేదని వారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు గ్రామస్తులకు, రైతులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇరువురి వాదనలు విన్న ఆర్డీవో ఈ విషయాన్ని కలెక్టర్ దష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ మాట్లాడుతూ 2018లో అప్పటి సర్పంచి ఉత్తర్వులు పొందామని రైతుల నుంచి 36 ఎకరాలు కొనుగోలు చేశామని కంకర మిషన్ వేయడానికి మాకు అన్ని హక్కులు ఉన్నాయని, ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చుట్టూ పెద్ద రేకులతో కాంపౌండ్ వాల్ నిర్మిస్తామని తెలిపారు. అలాగే ప్రజలకు ఎలాంటి వ్యాధులు రాకుండా జాగ్ర త్త చర్యలు తీసుకుంటామని సభాముఖంగా తెలిపారు. దీనిపై రైతులు మాట్లాడుతూ కంకర మిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పకుండా భూములు కొనుగోలు చేశారని, క్వారీల వల్ల భారీ నష్టం వాటిల్లుతుందని భూములు వెనక్కి తీసుకుంటామని తెలిపారు. రైతులకు, మీడియా ప్రతినిధులకు తెలపకుండా గ్రామ సభ ఎలా ఏర్పాటు చేస్తారని రైతులు అధికారులను ప్రశ్నించారు. అనంతరం విఆర్‌ఓ నూర్‌బాషాకు గ్రామ సచివాలయంలో రైతులు, గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఎట్టి పరిస్థితుల్లో క్వారీల ఏర్పాటును అడ్డుకుంటామని అధికారులు సహకరించాలని కోరారు. అలాగే దీనిపై కోర్టుకు వెళ్తామని గ్రామస్తులు తెలిపారు. అంతకుమునుపు ఉన్నత పాఠశాల విద్యార్థులు నిరసన తెలపడానికి అక్కడికి వెళ్లగా పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపినట్లు విద్యార్థులు తెలిపారు.

పెనుకొండ అసమ్మతి నాయకులతో

మంత్రి పెద్దిరెడ్డి సమావేశం

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గ పరిస్థితులపై వైసిపి రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ పరిశీలకులు బాబురెడ్డి, ఎంఆర్‌సి రెడ్డితో కలసి శనివారం తిరుపతిలోని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసంలో సుమా రు 3 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వారు పార్టీలో తమకు జరిగిన అన్యాయాన్ని పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పెనుకొండ వైసిపి నాయకులు పుప్పం సుధాకరరెడ్డి, గంపల రమణారెడ్డి, అక్కులప్ప,చాలకూరు అశ్వర్థమ్మ, సి.నారాయణరెడ్డి, నాగభూషణ రెడ్డి, దిలీప్ రెడ్డి, బీచగానిపల్లి బాలాజీ, కర్ర సంజీవరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, గోపాలరెడ్డి, కష్ణారెడ్డి, మురళి, తురకలపట్నం నరేంద్ర రెడ్డి, గుడిపల్లి కళ్యాణ్, చెన్నకష్ణారెడ్డి, గోరంట్ల లక్ష్మీనరసప్ప, మోతుకపల్లి శ్రీనివాసరెడ్డి, బొమ్మిరెడ్డి పల్లి రాము తదితరులు పాల్గొన్నారు.



అసమ్మతి నేతలతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఎమ్మెల్యే, వైసిపి నాయకులతో మంత్రి సమావేశం

వైసిపి రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరుపతిలోని స్వగహంలో పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి

ఖైదీల్లో మార్పురావాలి : జడ్జి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని న్యాయ సేవాధికార సంస్థ మండల ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి సూచించారు. ఆమె శనివారం పట్టణంలోని జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి శిక్ష నిమిత్తం జైలుకు వచ్చారని, సత్ప్రవర్తనతో మెలిగి జైలు నుంచి తొందరగా విడుదలవ్వాలని వారికి సూచించారు. అలాగే జైలులో ఖైదీల స్థితిగతులు, వారికి కల్పిస్తున్న భోజన వసతి, ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఖైదీలకు కల్పించే హక్కుల గురించి వివరించారు. ఖైదీలకు అందించే ఆహారం, వంటగదిని పరిశీలించారు. జడ్జి వెంట న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, న్యాయవాదులు నరసింహులు, వెంకటేష్, సిరాజుద్దీన్, రఘు, జైలు సూపరింటెండెంట్ వసుదేవరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ఎంజెపి జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్ష

లేపాక్షి : స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల గురుకుల కళాశాలలో ప్రవేశానికి ఆదివారం(నేడు) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్షకు విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్ వెంట తీసుకురావాలని సూచించారు. లేపాక్షి గురుకుల పాఠశాలలో 686 మంది, నసనకోటలో 436, గుడిబండలో 320, టేకులోడులో 322, గుండుమలలో 199 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాయనున్నారన్నారు. జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ గ్రూపులో 240, బైపీసీ 160, ఎంఈసి 80, సిఈసి 160 మొత్తం సీట్లు 640 ఉన్నాయని ఆయన తెలిపారు.

నెలాఖరులోపు ఈకేవైసీ చేసుకోండి

ధర్మవరం టౌన్ : ధర్మవరం తాలూకా పరిధిలో ప్రభుత్వ పెన్షనర్లు ఈ నెల 31వ తేదీ లోపు తప్పకుండా ఈకేవైసీ చేసుకోవాలని తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చలపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, సీఎఫ్ఎంఎస్ నంబరు తీసుకుని ట్రెజరీ కార్యాలయంలో ఈకేవైసీ చేసుకోవాలన్నారు. లేనిచో పెన్షన్ సకాలంలో బ్యాంకు ఖాతాలో జమ కాదని రాష్ట్ర పెన్షనర్ల సంఘం తెలిపిందని ఆయన తెలిపారు.

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని, ఆ రకంగా ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శ్రీధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆనందోత్సాహాల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేకి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్లు, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళ పతి, వైస్ ఛైర్మన్లు తిప్పన్న, లక్ష్మీనారాయణ రెడ్డి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు సర్పంచిలు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే కాలుష్య నివారణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చునని వాహన తనిఖీ అధికారి వరప్రసాద్, పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లా నుంచి అంబేద్కర్ కూడలి వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణం కలుషితం కాకూడదంటే ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో భాగంగా సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. వాతావరణ కాలుష్యం వల్ల నేడు అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అనేక ఇబ్బం దులకు గురవుతున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా వారు కదిరి పట్టణ ప్రజలు, వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు.



కదిరి పట్టణంలో వాహన తనిఖీ అధికారి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన దృశ్యం

'వాల్టా'కు తూట్లు

విచ్చలవిడిగా చెట్లు నరికివేత.. యథేచ్ఛగా కలప అక్రమ రవాణా.. మామూళ్ల మత్తులో అధికారులు

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర నియోజకవర్గంలో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా విచ్చల విడిగా పచ్చని చెట్లను నరికి కలపను యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజా సంఘాలు, మేధావులు, పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చని చెట్లను నరుకుతున్న వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇదే అదనుగా భావించి కొందరు వ్యాపారులు చెట్లను నరికి కర్నాటకలోని వివిధ ప్రాంతాలకు కలపను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు వాపోతున్నా రు. వ్యాపారులు విద్యుత్ పరికరాలను ఉపయోగించి రాత్రికి రాత్రే చెట్లను నరికి కలపను నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న కర్నాటకలోని శిర, పావగడ, మధుగిరి, తదితర ప్రాంతాలకు తరలిస్తున్నా అటవీశాఖ అధికారులు మామూళు తీసుకుని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. అటవీ ప్రాంతంలో చెట్లను పెంచడానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో ఆశయం నీరు గారిపోతుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకుని చెట్ల నరికివేతను, కలప అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ట్రాక్టర్‌లో కలపను తరలిస్తున్న దృశ్యం

కాలం చెల్లిన ఆహారపదార్థాలు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

ప్రజల ఆరోగ్యానికి హాని చేసే ఆహార పదార్థాలను తయారు చేసి, విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లిమా హెచ్చరించారు. ఆమె శనివారం స్థానికంగా ఉన్న బేకరీలను సందర్శించి అక్కడ తయారీ విధానం, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని శ్రీవెంకటేశ్వర స్వీట్స్ అండ్ హాట్ బేకరీలో నాణ్యత లేని ఆరోగ్యానికి హాని చేసే, చెడిపోయిన ఆహార పదార్థాలను గుర్తించి పారవేయాలని సూచించారు. అలాగే ఆహార పదార్థాల తయారీ తేదీని, ధరను తప్పని సరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. వినియోగదారులను ఆకర్షించడానికి బేకరీలలో ఆహారపదార్థాల తయారీలో రంగులు అధికంగా వాడటం మంచిది కాదని హెచ్చరించారు. అలాగే కాలం చెల్లిన ఆహార పదార్థాలు, బర్గర్ వంటి వాటిలో ఉపయోగించే కూరలను సీజ్ చేశారు. బ్యాక్టీరియా వచ్చిన బ్రెడ్, కేక్ లను, కాలం చెల్లిన ఆహార పదార్థాలను ఎందుకు నిల్వ ఉంచి అమ్మకాలు చేపడుతున్నారని హెచ్చరించారు. అలాగే ఆహార పదార్థాలను తయారు చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పలు బేకరీలకు వార్నింగ్ నోటీసులు జారీ చేశారు. ఇకపై అన్ని ప్రమాణాలు పాటించాలని సూచించారు. పరిస్థితి ఇలాగే ఉంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు.



చెడిపోయిన ఆహార పదార్థాలను పారవేయిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లిమా



వాలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే పివి సిద్ధా రెడ్డి

వాలంటీర్లు మరింత చురుగ్గా పనిచేయాలి

ఎమ్మెల్యే పివి సిద్ధా రెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను వాలంటీర్లు మరింత ఉత్సాహం తో ప్రజల్లోకి తీసుకెళ్లాలని, నిజమైన లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా కషి చేయాలని ఎమ్మెల్యే పివి సిద్ధా రెడ్డి సూచించారు.'వాలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాలులో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ వాలంటీర్ల సేవలను గుర్తించి ఏటా సేవా వజ్రా, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరిస్తున్నారన్నారు. వరుసగా మూడో ఏడాది వాలం టీర్లను సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జగన్ వాలంటీర్లపై నమ్మకం ఉంచి ప్రభుత్వం చేపట్టే ప్రతి పథకాన్ని వారి ద్వారా అమలుచేసేలా ప్రణాళికలు చేశారన్నారు. వాలంటీర్లు రాబోయే రోజుల్లో మరింత చురుగ్గా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అమర్నాథ్‌రెడ్డి, మండల అధికారులు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు, సర్పంచిలు, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, పోలింగ్ బూత్ మేనేజర్లు, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : నల్ల చెరువు మండల పరిధిలోని ఇందుకూరుపల్లికి చెందిన కీర్తన సాఫ్ట్ బాల్‌లో రాణిస్తోంది. చైనాలో జరిగే అంతర్జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలో పాల్గొంటున్న కీర్తనకు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ శనివారం రూ. 10వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రాంతానికి చెందిన కీర్తన సాఫ్ట్ బాల్‌లో రాణించడం శుభపరిణామం అన్నారు. కీర్తన జాతీయ స్థాయిలో రాణించి మన దేశానికి పతకం తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు సంపంగి గోవర్ధన్, నచ్చు బాలకష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు .



కీర్తనకు ఆర్థిక సాయం అందజేస్తున్న హరిప్రసాద్

సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చే బాధ్యత వాలంటీర్లదే : ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాశక్తి-అమరాపురం

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే బాధ్యత వాలంటీర్లదేనని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన వాలంటీర్లకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రభుత్వం, ప్రజలకు మధ్య వాలంటీర్లు వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నారన్నారు. అనంతరం ఉత్తమ వాలంటీర్లకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మునిస్వామి, జడ్పిటిసి సారక్క, నరసింహమూర్తి, లలితమ్మ, కష్ణమూర్తి, ఒక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళిని, వీరకేతప్ప, సుందర్‌రాజు, సింగిల్ విండో డైరెక్టర్ బగల చిక్కన్న , వైసిపి నాయకులు త్రిలోకనాథ్, నరేష్, ఈరన్న, నాగమ్మ, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ వాలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మాతా శిశు మరణాలు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జ్యోష్ణ సూచించారు. మండల పరిధిలోని మార్లపల్లి గ్రామంలో శనివారం డాక్టర్ జ్యోష్ణ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో పాటు నడవలేని వారికి ఇంటి వద్దకే వెళ్లి వివిధ జబ్బులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రజలు 104 సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని సూచించారు. పోషకాహారం తీసుకుంటూ, ప్రతిరోజూ వ్యాయామం చేయాలని తద్వారా శారీరక ఉల్లాసంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గి సంతోషకరమైన జీవనం గడపవచ్చు అన్నారు. ప్రతి ఫ్రైడేని డ్రైడేగా పాటించాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా, జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పి విజయభాస్క ర్, ఆరోగ్య కార్యకర్తలు శివ, రాధమ్మ, ఆశా కార్యకర్తలు నాగరత్నమ్మ, మహేశ్వరి, రత్నమ్మ, 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్ పాల్గొన్నారు.



కదిరిలో కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలోబయల్దేరిన తెలుగుతమ్ముళ్లు

మహానాడుకు తరలిన తెలుగుతమ్ముళ్లు

కదిరి టౌన్ : రాజమహేంద్రవరంలో జరుగుతున్న టిడిపి రాష్ట్రస్థాయి మహానాడుకు కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో 20 బస్సుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ మహానాడుకు టిడిపి శ్రేణులు వెళ్లకుండా అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులకు అనుమతి నిరాకరించిందని విమర్శించారు. ప్రభుత్వ నిరంకుశ ఆగడాలను తిప్పికొట్టేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై దిగ్విజయం చేసేందుకు సిద్ధమయ్యారని అన్నారు.

తనకల్లు : రాజమండ్రిలో జరుగుతున్న టిడిపి మహానాడుకు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. తొలుత స్థానిక బస్టాండ్ కూడలిలో బాణసంచా పేల్చి నినాదాలు చేస్తూ బయలుదేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, సరోజమ్మ కుంచె నాగేంద్రప్రసాద్ దాము మహబూబ్ బాషా ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : రాజమహేంద్రవరంలో జరుగుతున్న టిడిపి మహానాడు సభకు మండల పరిధిలోని ఆ పార్టీ నాయకులు శనివారం బయల్దేరి వెళ్లారు. ముందుగా వారు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెళ్లిన వారిలో మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, చంద్ర, రవి, మంజునాథ్, తదితరులు ఉన్నారు



లేపాక్షిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వాలని అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జి.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్యవైశ్య సంఘం నాయకులు కోటా సత్యంను హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ధర్మవరం పట్టణానికి చెందిన వ్యాపారవేత్త, ఆర్యవైశ్య సంఘం ప్రముఖుడు తబ్జుల్ సాయి ప్రసాద్‌ను పరిరక్షణ ట్రస్టు రాష్ట్ర సంస్థ సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని కోటా సత్యం అందజేశారు. అనంతరం వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ తమ సమితి ప్రధాన డిమాండ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలని కోరారు. ముఖ్యంగా పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని, రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని, గన్నవరం విమానాశ్రయానికి పొట్టి శ్రీరాము లు పేరు పెట్టాలని, రాష్ట్ర అవతరణ నవంబరు ఒకటిన ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని, పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతిని ప్రభుత్వపరంగా నిర్వహించి సెలవు ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌ను కోటా సత్యం దుశ్శాలువాతో సత్కరించి సత్యసాయి జ్ఞాపికను బహూకరించారు.



వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న కోటా సత్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏపి జిఈఏ జిల్లా ఉపాధ్యక్షులు గోవిందప్ప

ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

ఏపిజిఈఏ జిల్లా ఉపాధ్యక్షులు గోవిందప్ప

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని ఏపి జిఈఏ జిల్లా ఉపాధ్యక్షులు గోవింద ప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మడకశిర పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద గోవిందప్ప ఆధ్వర్యంలో తహశీల్దార్ చేతుల మీదుగా ఉద్యోగుల సమస్యలపై ముద్రించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. ముఖ్యంగా సిపిఎస్ రద్దు, ప్రతి నెలా 1వ తేదీ వేతనాల చెల్లింపు, పిఆర్సి అమలు, పెండింగ్ బకాయిలు, తదితర 200 డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 29వ తేదీ తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న, తాలూకా అధ్యక్షులు మహాలింగప్ప, ఏపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు లతా రామకష్ణ, బి.ఎడ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.



శ్మశానవాటిక కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ రంగనాయకులు

శ్మశానవాటికకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని కమ్మవారిపల్లి గ్రామంలో శ్మశానవాటిక కోసం శనివారం తహశీల్దార్ రంగనాయకులు స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్తులు, సర్పంచి తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన తహశీల్దార్ గ్రామ సమీపంలో స్థానికలతో కలిసి పలుచోట్ల స్థలాలను పరిశీలించి సర్వే చేయించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించి సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట సర్పంచి శివమణిరెడ్డి, ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొత్త వెంకట రంగారెడ్డి, రామిరెడ్డి, విఆర్ఓ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసులో నిందితుడు అరెస్టు

ధర్మవరం టౌన్ : పెయింటర్ సాకే నవీన్‌కుమార్ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్ బాషా తెలిపారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం వారు విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక సిద్దయ్యగుట్ట సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి పెయింటర్ సాకే నవీన్‌కుమార్‌ను దుండగులు దారుణంగా హత్య చేయగా కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామన్నారు. అందులో భాగంగా వన్‌టౌన్ సీఐ, ట్రాఫిక్ సీఐ ఆధ్వర్యంలో రెండు బందాలుగా ఏర్పడి హత్యకు గల కారణాలు తెలుసుకోవడంతో పాటు నిందితుడు నిమ్మలరెడ్డి శేఖర్‌ను 24 గంటల్లోపే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సాకే నవీన్ కుమార్ పెయింటర్ వత్తిపై ఆధారపడి జీవిస్తున్నా రు. నిమ్మలరెడ్డి శేఖర్ అన్నమయ్య జిల్లా కంబలపల్లి మండలంలోని కప్పల వారిపల్లి గ్రామానికి చెందినవాడు. బేల్దారి పనులు చేసుకుంటూ జీవించేవాడు. వీరికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో వారు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద మద్యం తాగారు. అనంతరం శేఖర్ దేవాలయంలోకి వెళ్తుండగా నవీన్ అభ్యంతరం తెలపడంతో ఘర్షణ చోటు చేసుకొంది. ఈ క్రమంలో శేఖర్ అక్కడ ఉన్న బండరాయితో నవీన్‌పై విక్షణారహితంగా డాడి చేసి హత్య చేశాడు. ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకుని నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సమాచారం అందడంతో శనివారం సాయంత్రం 4.15 గంటల సమయంలో గాంధీనగర్‌లో నిందితుడు శేఖర్‌ను అరెస్టు చేశారు. హత్య కేసును 24 గంటల్లోపే ఛేదించినందుకు ఎస్పీ మాధవరెడ్డి ధర్మవరం వన్ టౌన్ సీఐ సుబ్రమణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్ బాషా, సిబ్బందిని అభినందించారు.



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్‌బాషా

చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తారకరామాపురంలో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు వేణుగోపాల్ శనివారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానకి పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తారకరామాపురానికి చెందిన వేణుగోపాల్ కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ విషయంలో శనివారం భార్య వసుంధరతో గొడవపడ్డాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

సోమందేపల్లి : స్థానిక వాల్మీకి సర్కిల్ సమీపంలో నివాసం ఉంటున్న నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు వడ్డే గోపి(39) శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇం ట్లోనే ఉరి వేసుకొన్నాడు. కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో పెనుగొండ ప్రభుత్వాసు పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. గోపికి భార్యతో పాటు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. వాల్మీకి సర్కిల్‌లో దుస్తుల దుకాణం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తుండేవాడు. ఇంటి పెద్దదిక్కు మరణించడంతో దిక్కులేని వారమైపోయామని భార్యా పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గానికి చెందిన పలు వురు టిడిపి నాయకులు గోపి మృత దేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో శవానికి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.




వడ్డే గోపి

వాల్మీకి విద్యార్థులకు నగదు పురస్కారాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందజేశారు. శనివారం సాయి ఆరామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, శాసనమండలి సభ్యులు మంగమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొని పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉన్నత విద్యకు పేదరికం అడ్డుకారాదని, ప్రతిభ కనపరిచిన వాల్మీకి విద్యార్థులను విద్య పరంగా సంఘం ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ ఘనపరిచిన విద్యార్థులు ఉన్నత చదువులలో మరింత రాణించాలని కోరారు. ప్రతిభ ఉండి ఉన్నత విద్యలో రాణించే విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు నగదు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, మాజీ ఛైర్మన్ పి సి గంగన్న, ఏ డి సి సి బ్యాంక్ ఛైర్మన్ వాల్మీకి నాయకులు ఈశ్వరయ్య, పొగాకు రామచంద్ర, ఇంకా పలువురు మాజీ ఛైర్మన్లు నాయకులు పాల్గొన్నారు.



వాల్మీకి విద్యార్థులను సత్కరిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

వాలంటీర్లకు సన్మానం

లేపాక్షి : మండల పరిధిలోని పులమతిలో శనివారం సర్పంచి అశ్వర్థనారాయణ ఆధ్వర్యం లో 14 మంది వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వాలంటీర్లు మరింత చురుగ్గా పనిచేసి సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తూ, పంచాయతీ అభివద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య, గ్రామ రెవెన్యూ అధికారి సుధాకర్ రెడ్డి, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు

నేడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

ధర్మవరం టౌన్ : ధర్మవరంలో పట్టణం లో ఆదివారం(నేడు) నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నా మని, టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాల ని టిడిపి వర్గాలు శనివారం ఓ ప్రకట నలో తెలిపారు. ముందుగా ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నా రు. అలాగే మాజీ మంత్రి పరిటాల సునీత జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బోరు బావి చుట్టూ మురుగునీరు..

పట్టించుకోని అధికారులు

నల్లమాడ : నల్లమాడ-పుట్టపర్తి ప్రధాన రహదారిలోని కంబాలపర్తి గ్రామంలో తాగునీటి పథకం బోరు చుట్టూ మోకాలి లోతు నీరు నిలిచి మురుగునీటి కుంటను తలపిస్తోంది. ఈ గుంత కప్పలు, దోమలకు నిలయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో పుట్టపర్తి నుంచి కదిరి వైపు నిత్యం జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు రాకపోకలు సాగిస్తుంటారు. దోమల వ్యాప్తికి నిలయంగా మారిన ఈ మురుగునీటి కుంటను తొలగించాలని పంచాయితీ పాలకులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.



తాగునీటి బోరు చుట్టూ నిలిచిన వృథానీరు